సాక్షి
ఖమ్మం
సోమవారం ॥ 25 ॥ డిసెంబర్ ॥ 2023



అథ్లెటిక్స్‌కు అనూహ్య స్పందన
ఖమ్మంలో ఆదివారం అండర్ - 14, 16 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలకు స్పందన లభించింది. 8లో



నేటితో ప్రచారం బంద్
ఈనెల 27న జరుగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియనుంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 17°

వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి పొంగులేటి క్రిస్మస్ శుభాకాంక్షలు



ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యేసుక్రీస్తు జన్మించిన రోజును క్రిస్టియన్లు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని, యేసుక్రీస్తు దీవెనలు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. నిరుపేదలు పండుగను ఘనంగా జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ బహుమతులను అందజేసిందని తెలిపారు.

ఎంపీ నామ, మాజీ మంత్రి పువ్వాడ..
ఖమ్మంమయూరిసెంటర్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రజలకు, క్రైస్తవులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. అందరినీ ప్రేమిస్తూ, శాంతి మార్గంలో నడుస్తూ క్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని, క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని పేర్కొన్నారు. క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజని, ప్రతీ ఒక్కరూ తమ కుటుంబాలతో ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లాలో నేడు మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం రాత్రికే ఖమ్మం చేరుకున్న తుమ్మల సోమవారం తెల్లవారుజామున 5.15 గంటలకు చర్చి కాంపౌండ్‌లో ఉన్న సీఎస్ఐ చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు క్యాంప్ కార్యాలయంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్న భోజనం తర్వాత కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కోమటిరెడ్డి

నల్లగొండకు తుమ్మల, వరంగల్‌కు పొంగులేటి



కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నల్లగొండ ఎమ్మెల్యే, ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం అమలు, సమీక్ష, పర్యవేక్షణ బాధ్యతలను జిల్లాలో కోమటిరెడ్డి చేపట్టనున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఖమ్మం ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు.

టెండర్లు దాఖలు చేయండి

ఖమ్మం సహకారనగర్ : కలెక్టరేట్‌లో 10 హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ల కొనుగోలుకు ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు కార్యాలయ పనివేళల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో సంప్రదించి టెండర్లు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు) సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కోశాధికారిగా సెల్యూకాస్



కె.ఈ.సెల్యూకాస్

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కె.ఈ సెల్యూకాస్‌ను రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. ఆయన ఈ పదవిలో నాలుగేళ్ల పాటు కొనసాగుతారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ సెల్యూకాస్‌కు అభినందనలు తెలిపారు.

ఆరోగ్య 'మస్తు'



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

పేదలకు వరంగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం

- ప్రతీ కుటుంబానికి వైద్య సాయం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 7 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- కొత్త ప్రభుత్వం రాకతో పథకంలో మార్పులు

ఖమ్మంవైద్యవిభాగం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరోగ్య శ్రీ ద్వారా ప్రతీ కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య సహాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే హామీని నిలబెట్టుకుంటూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా తెల్లరేషన్ కార్డుదారులు ఏడాదికి రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందేలా అవకాశం కల్పించింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఈ నెల 9వ తేదీన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. అదే రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా పథకం ప్రారంభమైంది. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జిల్లా కలెక్టర్లు పథకాన్ని అమల్లోకి తెచ్చారు. లబ్ధిదారులు పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ఐదు రోజుల్లోనే ఉమ్మడి జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. భద్రాద్రి జిల్లాలో సుమారు 100 మంది సద్వినియోగం చేసుకోగా, ఖమ్మం జిల్లాలో 250 మంది వరకు లబ్ధి పొందారు. ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకే ఉండే ఆర్థిక సాయం, ఒక్కసారిగా రెట్టింపు అయ్యే సరికే లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

రాజశేఖరరెడ్డి చొరవతో మొదలు..
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో ఆరోగ్యశ్రీ పథకం పురుడుపోసుకుంది. ఆయన చేసిన పాదయాత్రలో ప్రధానంగా దృష్టికి వచ్చిన ఉమ్మడి రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు పరిష్కారమార్గం చూపేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారు. ఆర్థికంగా స్తోమత లేని నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు ఈ పథకం ద్వారా అప్పట్లో ఎంతో మేలు జరిగింది. ఉమ్మడి జిల్లాలో 2008లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి రాగా సుమారు 1,026 రకాల వైద్య చికిత్సలు ఉచితంగా రూ.2 లక్షల వరకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో లక్షలాది మంది వినియోగించుకున్నారు. అనంతరం 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం అందుబాటులోకి తేగా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం కలిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 646 రకాల వ్యాధులకు సేవలు పొందే అవకాశం లభించింది. తాజాగా వచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబం ఏడాదికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చు. కుటుంబంలో ఎంత మందికి సమస్య వచ్చినా ఏడాదికి గాను ఆ మొత్తం వరకు అవకాశం ఉంటుంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, కంటి, ఎమర్జెన్సీ, ట్రామా, డయాలసిస్ తదితర వ్యాధులకు చెందిన సుమారు 1,672 రకాల సేవలు పొందవచ్చు. ఈ సేవలన్నీ కూడా ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉండే ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వినియోగించుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 39 ఆస్పత్రులు

ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి జిల్లాలో విస్తృతమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ఏడు ప్రభుత్వ ఆస్పతులు, 18 నెట్‌వర్క్ (ప్రైవేట్) ఆస్పత్రుల్లో ఈ సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవచ్చు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9 ప్రభుత్వ ఆస్పత్రులు, 5 ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలు, టీం లీడర్ల ద్వారా లబ్ధిదారులకు సేవలు అందుతాయి. కాగా, ఖమ్మం జిల్లాలో 4,11,347 కుటుంబాలు, భద్రాద్రి జిల్లాలో 2,93,322 కుటుంబాలు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద లబ్ధిపొందేందుకు అర్హత కలిగి ఉన్నాయి. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఆయా ఆస్పత్రులకు వెళ్తే ఆరోగ్యశ్రీ సిబ్బంది వారికి సహకరించి ఉచితంగా వైద్య సేవలు అందేలా చూస్తారు. కాగా, ఉమ్మడి జిల్లాలో 2014 నుంచి 2023 మార్చి వరకు ప్రభుత్వ పరంగా 6,264 ఆరోగ్యశ్రీ కేసులకు చికిత్స అందించగా తద్వారా రూ.19.93 కోట్లు ఖర్చయ్యాయి. అలాగే ప్రైవేట్ పరంగా 56,861 కేసులు నిర్వహించగా వాటి ద్వారా రూ.165.81 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. అలాగే, భద్రాద్రి జిల్లాలో 7,306 కేసులకు రూ.13.92 కోట్లు ఖర్చు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,986 కేసులు నిర్వహిస్తే రూ.12.28 కోట్లు ఖర్చయింది.

సద్వినియోగం చేసుకోండి



అర్హులైన ప్రతీ లబ్ధిదారుడు ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం గతంలో కంటే రెట్టింపు నిధులు వెచ్చించటం మూలంగా మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం వెచ్చిస్తున్నందున ఖరీదైన వైద్యం అందుబాటులోకి రానుంది. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఎవరికే సమస్య ఉన్నా, ఇబ్బందులు కలిగినా ఖమ్మం, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రుల్లోని తమ కార్యాలయాల్లో సంప్రదిస్తే తగిన విధంగా సహకరిస్తాం.

–డాక్టర్ మాధవరావు, ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

ఎన్‌ఎఫ్‌పీఈ జాతీయ కార్యదర్శి మధుసూదన్ రావు



మాట్లాడుతున్న మధుసూదన్ రావు

ఖమ్మంగాంధీచౌక్: హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం క్లాస్ - 3, పోస్టుమెన్, ఎంటీఎస్ కార్యదర్శి మధుసూదన్ రావు అన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎఫ్‌పీఈ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు, చర్యలకు భయపడవద్దని, ఉద్యమాలతో అనేక సమస్యలను పరిష్కరించుకున్నామని, అదే స్ఫూర్తి కొనసాగించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలిగించిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని విమర్శించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, మహమ్మద్, నాయకులు రామశాస్త్రి, ఎన్ఆర్‌సీ రావు, లెనిన్ శ్రీనివాస్, ఎస్వీ రావు, అబ్దుల్, రవీందర్ రావు, రాజేశ్వరి, అమల, కనకయ్య, సురేష్, శ్రీనివాసరావు, కాశీం, శేషు, రామారావు పాల్గొన్నారు. అనంతరం సంఘం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై. సత్యనారాయణ, కార్యదర్శిగా పెరుగు నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎం.శ్రీరాం ఎన్నికయ్యారు.

జనవరి 1 నుంచి 'పాలేరు'కు నీరు

కూసుమంచి : పాలేరు పాత కాలువకు యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయాలని శనివారం పాలేరు వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రైతులు, పలువురు నాయకులు కలిసి విన్నవించారు. ఈ మేరకు అధికారులతో చర్చించిన మంత్రి.. రైతులకు ఇబ్బంది లేకుండా నీరు విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో జనవరి 1 నుంచి కాలువకు నీరు విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం, క్రిస్మస్ సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

అంబసత్రంలో రాపత్తు సేవ
అధ్యయనోత్సవాల్లో భాగంగా రామయ్య స్వామికి రాపత్తు సేవలు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, శ్రీరామనామస్మరణల నడుమ పల్లకీ సేవగా అంబసత్రానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత హారతి సమర్పించారు.

అలరించిన 'నెలనెలా వెన్నెల'

ఖమ్మంగాంధీచౌక్ : ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన నెలనెలా వెన్నెల కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెలగలేరుకు చెందిన వెలగలేరు థియేటర్ ఆర్ట్ కళా బృందం వారు నటించిన 'నెట్' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కొందరు సమాజాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే అంశంపై రూపొందించిన ఈ నాటిక సమాజ చైతన్యానికి దోహదపడేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా మాట్లాడుతూ.. నెలనెలా వెన్నెల కార్యక్రమంలో ప్రదర్శించే నాటికలు సమాజంలో జరిగే అంశాలను ప్రబింబించేలా ఉంటున్నాయని అన్నారు. ఖమ్మం ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా పున్నమి వెన్నెలను అందిస్తున్నారని అభినందించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల కొండలరావు మాట్లాడుతూ.. పెడదోవ పడుతున్న యువతను సన్మార్గం వైపునకు నడిపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అంతకుముందు నెల నెలా వెన్నెల వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ బుగ్గవీటి నర్సింహారావు, ప్రజా నాట్యమండలి నాయకుడు చల్లా రంగయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, దేవేంద్ర, మోటమర్రి జగన్మోహన్ రావు, ఏఎస్‌కుమార్, సతీష్, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ..



వైరాలోని ట్రినిటీ హోలి చర్చిలో వేడుకలు..



క్రిస్మస్ సందడి..

వైరా : జిల్లాలో ఆదివారం రాత్రి నుంచే క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. పలు చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. వైరా శాంతినగర్‌లోని ట్రినిటీ హోలి చర్చిలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కోలాటాలు, నృత్యాలతో క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. చర్చి ఫాదర్ జ్వాన్నిస్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ నిర్వహించారు. బాల యేసు ప్రతిమను ముద్దాడి క్రీస్తు జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. 9లో

ఎమ్మార్సీల ఆన్‌లైన్!

- ప్రతీ సెంటర్‌కు కంప్యూటర్లు, ప్రింటర్
- ఎప్పటికప్పుడు వివరాల నమోదుకు అవకాశం
- రూ.1.10 కోట్లకు పైగా నిధులతో కొనుగోలు



ఖమ్మం అర్బన్ ఎమ్మార్సీకి చేరిన కంప్యూటర్లు, ప్రింటర్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. విద్యాశాఖ కార్యాలయాల్లో వసతులు కూడా సమకూరుస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్ల(ఎమ్మార్సీ)లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో 21 మండలాలకు గాను రఘునాథపాలెం మినహా 20 మండలాలకు సంబంధించి ఆరు కంప్యూటర్లు, ఒక్కో ప్రింటర్‌ను సమకూర్చింది.

రూ.కోటికి పైగా నిధులు..
జిల్లాలోని 20 మండలాల్లోని ఒక్కో ఎంఆర్‌సీకి ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ చొప్పున అధికారులు పంపిణీ చేశారు. అంతేకాక కేబుళ్లు, డెస్క్ కలిపి ఒక్కో మండలానికి రూ.5,52,690 వెచ్చించారు. ఇందులో ఆరు కంప్యూటర్లు, ప్రింటర్‌కు రూ.4,34,860, కేబుళ్లు, ర్యాక్‌లకు రూ.47,090, బ్యాకప్ బ్యాటరీలకు రూ.70,740 వెచ్చించినట్లు చెబుతున్నారు. మొత్తంగా జిలాల్లో రూ.1,10,53,800 నిధులు కేటాయించగా.. ఇంటర్నెట్ కూడా సమకూరుస్తే ఆన్‌లైన్ వసతి అందుబాటులోకి రానుంది.

ఉపయోగం ఇలా..
విద్యార్థుల వివరాల నమోదు, పాఠశాలలోని సౌకర్యాలు, టీచర్ల వేతనాల బిల్లులతో పాటు మధ్యాహ్న భోజనం తయారు చేసే వారి వివరాలు నమోదు చేసేందుకు ఇన్నాళ్లు సీఆర్‌పీలు(క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్) ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం కంప్యూటర్లు సమకూర్చింది. మండల వనరుల కేంద్రంలో కంప్యూటర్లను అందుబాటులో ఉంచడం ద్వారా క్షేత్రస్థాయిలోని పాఠశాలల వివరాలను నమోదు చేసే సమయంలో ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రస్తుతం కంప్యూటర్లను సిద్ధం చేసేందుకు వైరింగ్ చేస్తుండగా.. రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

సమగ్ర సమాచారం నమోదు



రాష్ట్ర ప్రభుత్వం ఎంఆర్‌సీలకు ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను అందిస్తుంది. దీని వల్ల మండలంలోని పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నమోదు చేయొచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని వేగవంతంగా అందుబాటులోకి తీసుకరానున్నాం.

– ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

సీఎం సమావేశంలో కలెక్టర్, సీపీ



హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ హాజరయ్యారు. జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి వారు వివరించారు. – ఖమ్మం సహకారనగర్

ఆర్టీసీకి ఆదాయం అదుర్స్

- ఖమ్మం రీజియన్‌లో 101 శాతం ఓఆర్
- ఒక్కరోజే రూ.1.53 కోట్ల రాబడి
- మిఠాయిలు తినిపించుకున్న అధికారులు, సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి టౌన్ : ఆర్టీసీ రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధించింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఖమ్మం రీజియన్‌లో ప్రయాణికుల రాకపోకలతో గతంలో ఎన్నడూ లేని విధంగా శనివారం 101 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) నమోదు చేసుకుంది. కొన్నేళ్లుగా సరైన ఆదాయం రాక, అప్పులు పెరగడంతో ఆర్టీసీ ఇబ్బందులు పడుతూ వచ్చింది. వచ్చే ఆదాయం ఇటు సిబ్బంది వేతనాలు, అటు బస్సుల నిర్వహణకు సరిపోక నష్టాలే మిగిలాయి. అనేక సంవత్సరాలుగా ఆర్టీసీకి లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం వచ్చిన దాఖలాలు లేవు. ప్రయాణికులు ఎక్కువగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో సంస్థ ఆదాయానికి గండిపడుతూ వచ్చింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడంతో ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య రెట్టింపు అయింది. దీంతో ఖమ్మం రీజియన్‌లో రద్దీ పెరగడంతో అదే స్థాయిలో ఆదాయం కూడా పెరిగింది. శనివారం ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో రూ.1.53 కోట్ల ఆదాయం రావడం విశేషం. ఇది టీఎస్ ఆర్టీసీకి రీజియన్‌లో ఓ చరిత్ర అని అధికారులు చర్చించుకుంటున్నారు.



సత్తుపల్లి డిపోలో ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ డీఎం విజయశ్రీ

కలిసొచ్చిన సెలవులు, మహాలక్ష్మి..
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీనికి తోడు ఆదివారం సెలవు, సోమవారం క్రిస్మస్, మంగళవారం బాక్సింగ్ డే.. ఇలా వరుసగా సెలవులు కావడంతో శనివారమే భారీ సంఖ్యలో ప్రయాణాలు సాగించారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇళ్లకు చేరుకునేందుకు శనివారమే బయలుదేరారు. ఇలా అన్ని వర్గాల ప్రయాణికులతో బస్సులన్నీ కిటకిటలాడాయి. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సుల ద్వారా శనివారం ఒక్క రోజే 2.36 లక్షల మంది ప్రయాణించగా.. ఆర్టీసీకి రూ.1.53 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు లెక్కలు వేశారు. సాధారణంగా ఖమ్మం రీజియన్‌లో రోజుకు రూ.1.01 కోట్లు ఆదాయం పొందాలనే లక్ష్యంతో అధికారులు బస్సులు తిప్పుతున్నారు. తొలిసారి లక్ష్యానికి మించి ఆదాయం వచ్చింది. కిలోమీటర్‌కు రూ.64.89 చొప్పున ఆదాయం వచ్చింది.

డిపోల వారీగా ఆదాయం (రూ.లలో)	
ఖమ్మం	35,92,701
మధిర	17,37,790
సత్తుపల్లి	27,81,755
భద్రాచలం	28,81,670
కొత్తగూడెం	17,40,482
మణుగూరు	20,48,062
ఇల్లెందు	5,22,487

అత్యధికంగా కొత్తగూడెంలో 111 శాతం ఓఆర్..
ఖమ్మం రీజియన్ పరిధిలో కొత్తగూడెం డిపో 111 శాతం ఓఆర్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఖమ్మం 103 శాతం, భద్రాచలం 102 శాతం, మధిర 100శాతం, సత్తుపల్లి 99 శాతం, మణుగూరు 97 శాతం ఓఆర్ సాధించగా, అతి తక్కువగా ఇల్లెందు డిపో 94 శాతం ఓఆర్‌కు పరిమితమైంది.

మిఠాయిల పంపిణీ ..
చరిత్రలో వంద శాతం ఓఆర్‌తో పాటు గణనీయమైన ఆదాయం రావడంతో ఖమ్మం, సత్తుపల్లి డిపోల్లో ఆదివారం సంబురాలు చేసుకున్నారు. అధికారులు, సిబ్బంది మిఠాయిలు తినిపించుకున్నారు. ఖమ్మం ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్ వెంకన్న రీజియన్‌లోని అన్ని డిపోల అధికారులు, సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాగే ఆర్టీసీ సేవలు ప్రజలకు అందించి మంచి ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లి డిపోలో అసిస్టెంట్ డీఎం విజయశ్రీ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సకల ఉద్యోగ సంఘాల ఐక్య వేదికలో వక్తలు



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంసహకారనగర్: జిల్లా సకల ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు.. ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి సమస్యల వినతిపత్రాలు బుక్ బైండింగ్ తయారు చేసి ముగ్గురు మంత్రులకు అందజేయాలని తీర్మానించామన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, కొనిదేన శ్రీనివాస్ గుంటుపల్లి శ్రీనివాసరావు, జైపాల్, శ్రీధర్‌సింగ్, పొట్టపింజర రామయ్య, గంగవరపు బాలకష్ణ, వెంకట్రావు, ప్రకాష్, విజయ్, పలు విభాగాల నాయకులు విజయ్, పారుపల్లి నాగేశ్వరరావు, మోత్కూరు మధు, కట్టా శేఖర్, సూర్య ప్రకాష్‌రావు, అనిల్‌కుమార్, కనపర్తి వెంకటేశ్వర్లు, భవాని, పద్మ, రఫీ, పాషా, కరుణ, వాసిరెడ్డి శ్రీనివాస్, అప్పారావు, రమేశ్, బాబు, జగన్, జెకే కుమార్, తాళ్లూరి శ్రీకాంత్, కృష్ణారావు, వేణుగోపాల్, రమణ మన్మథరావు, ఏడుకొండలు, చందు జ్యోతి, నిర్మల, యశోద, ఐకేపీ సంపత్, ఉష తదితరులు పాల్గొన్నారు.

‘పంచాయితీ’ తెగేనా..?

- పాలకవర్గంలేక కుంటుపడుతున్న భద్రాచలం అభివృద్ధి
- మూడు పంచాయతీలుగా విభజిస్తూ గత ప్రభుత్వ జీఓ
- రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సవరణ బిల్లు
- రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో ఉత్కంఠ
- ఎన్నికలు జరపాలని ఆశావాహుల ఎదురు చూపులు



భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయం

భద్రాచలం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మరో నెల రోజుల్లో స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమవుతుందని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో భద్రాచలం, సారపాక గ్రామ పంచాయతీల వ్యవహారం మళ్లీ చర్చకు వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలం గ్రామపంచాయతీ పాలకవర్గం సమయం ముగిసినా మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. భద్రాచలాన్ని మూడు గ్రామపంచాయతీలుగా విభజిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపగా, గవర్నర్ తమిళిసై ఆపివేశారు. దీంతో పంచాయతీ రాజ్ బిల్లును సవరణ చేసి రెండోసారి గవర్నర్ వద్దకు పంపారు. ఈ నేపథ్యంలో భద్రాచలం గ్రామపంచాయతీని విభజించొద్దని కాంగ్రెస్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించారు. తాజాగా కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వచ్చింది. భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ గెలిచింది. ఈ క్రమంలో ఒకే పంచాయతీగా కొనసాగిస్తారా? లేక మూడుగా విభజిస్తారా? అనే విషయమై ఉత్కంఠ నెలకొంది.

2018 నుంచి పాలకవర్గం లేకుండానే..

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరగ్గా, పాలకవర్గం పదవీ కాలం 2018 ఆగస్టులో ముగిసింది. ఆ తర్వాత తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం, సారపాకలను మున్సిపాలిటీలుగా ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘ నాయకులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2018 నుంచి ఇప్పటివరకు భద్రాచలంలో పంచాయతీకి పాలకవర్గం లేకుండాపోయింది. అధికారుల పాలనే సాగుతోంది. అనంతర కాలంలో మున్సిపాలిటీనా? పంచాయతా? అనే విషయం తేల్చి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 45ను విడుదల చేసింది. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తున్నట్లు ప్రకటించింది.

గవర్నర్ వద్ద పెండింగ్‌లో బిల్లు..

జీఓ నంబర్ 45 స్థానిక ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందంటూ బీఆర్ఎస్ మినహా అన్ని ప్రతిపక్షాలు, కొన్ని ఆదివాసీ సంఘాలు నిరసన తెలిపాయి. అప్పటి భద్రాచలం (కాంగ్రెస్) ఎమ్మెల్యే పొదెం వీరయ్య గవర్నర్‌ను, మంత్రులను కలిసి జీఓను రద్దు చేయాలని కోరారు. కాగా అసెంబ్లీలో పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేసి బిల్లును గవర్నర్ వద్దకు పంపారు. గవర్నర్ తిప్పి పంపగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అసెంబ్లీలో సవరణ చేసి బిల్లును రెండోసారి తిరిగి గవర్నర్ వద్దకు పంపింది. అయితే గవర్నర్ తమిళిసై నిర్ణయం వెలువరించకుండా బిల్లును పెండింగ్‌లో ఉంచారు. గత నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ బిల్లుపై చర్చ మొదటికొచ్చింది.

ఈసారైనా ఎన్నికలు జరిగేనా?

మరో రెండు నెలల్లో స్థానిక ఎన్నికల సమరం మొదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 45ను కొత్త ప్రభుత్వం రద్దు చేస్తుందా? చట్ట సవరణతో మూడు పంచాయతీలుగా విభజిస్తుందా? ఎన్నికలు ఎలా నిర్వహించనుందనే విషయాలపై స్థానికుల్లో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. కాగా ప్రభుత్వం సత్వరమే నిర్ణయం తీసుకోవాలని నిధులు లేక భద్రాచలం అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొంటున్న స్థానిక ప్రజలు, పదవులపై ఆశపెట్టుకున్న నాయకులు కోరుతున్నారు.

ప్రజాభిప్రాయం ప్రకారం..



భద్రాచలాన్ని మూడు పంచాయతీలా విభజించాలా? ఒకటే పంచాయతీగా ఉంచాలా? అనే విషయమై పట్టణ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు ముందుకెళ్తాం. భద్రాచలం అభివృద్ధికి కృషి చేస్తా. రానున్న పంచాయతీ ఎన్నికలలోపు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఎన్నికలను జరపాలని ప్రభుత్వాన్ని కోరతాం.

–తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

జమలాపురం ఆలయంలో ప్రసాద్‌రెడ్డి దంపతుల పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి దంపతులు శ్రీస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పొంగులేటి ప్రసాద్‌రెడ్డి కుమారుడు లోహిత్ రెడ్డి వివాహం త్వరలో జరగనుండగా శ్రీస్వామివారి చెంత శుభలేఖను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పొంగులేటి ప్రసాదరెడ్డి దంపతులకు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు.



జమలాపురం ఆలయంలో పూజలు చేస్తున్న పొంగులేటి ప్రసాదరెడ్డి దంపతులు



ఇందిరమ్మ, రాజన్న రాజ్యం స్థాపిద్దాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని

సత్తుపల్లి: ‘భట్టి విక్రమార్క రాజన్న ఇచ్చిన నాయకుడు.. ఇందిరమ్మ, రాజన్నరాజ్యాన్ని స్థాపిద్దాం.. తెలంగాణకు మంచి రోజులు వచ్చాయి’ అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాత్రి క్రిస్మస్ సంబురాలల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లతో కలిసి మల్లు నందిని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదేళ్లు భరించిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని, మల్లు భట్టివిక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన పాదయాత్రలో ప్రజల బాధలు, సమస్యలు విని ఆరు గ్యారెంటీలను తీసుకొచ్చారని, 100 రోజుల్లో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా కలిసి పని చేస్తామని పేర్కొన్నారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి రండి..

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్‌లు మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ కల్లూరు సభలో సత్తుపల్లి జిల్లా చేస్తామని హామీ ఇచ్చారని, భట్టి విక్రమార్కను ఒప్పించి జిల్లాను సాధిస్తే జన్మధన్యమవుతుందని చెప్పారు. మల్లు నందిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని, మధిరకే కాదు.. సేవలు జిల్లాకు అందించాలని కోరారు. అమ్మా ఫౌండేషన్‌తో మధిరలో చేస్తున్న సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో దాసరి శ్రీలక్ష్మీరెడ్డి, జయపాల్‌రెడ్డి, శివవేణు, అలవాల కరుణాకర్, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, గోలి శ్రీనివాసరెడ్డి, ఎండీ కమల్‌పాషా, ఎస్కే మౌలాలి, మలిరెడ్డి మురళీరెడ్డి, పద్మజ్యోతిరెడ్డి, ఎండీ ఫయాజ్‌అలీ, పుచ్చకాయల సోమిరెడ్డి పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న మల్లు నందిని పక్కన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc (Agri), B.Sc (Nursing), B.Ed, MBA, MCA Eligible for all Govt Jobs & Further Studies. Ph: 8866977112,339. [HA-14940]

Real Estate

HOUSES FOR SALE

■ ఖమ్మం, ఇల్లందు రోడ్‌లో గజం 15,000 నుండి 19,100 వరకు, ఇండ్లు 73 లక్షలతో కట్టించి ఇవ్వబడును. వివరాలకు సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్ – 93993 42239. [M-1167566]

■ ఖమ్మం, వైరా రోడ్‌లో DTCP గజం 8000 నుండి 13,000 వరకు, ఇండ్లు 86 లక్షల నుండి కట్టించి ఇవ్వబడును. వివరాలకు సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్ – 93993 42239. [M-1167567]

Wanted

■ ప్రముఖ మాల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ ఇంఛార్జ్ (మాల్ పర్సనల్) ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు కావలెను. అవకాశం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక. సంప్ర. సెల్ : 86397 07933. [M-1167570]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ Wanted Marketing Executives for Solar Energy Products Dr. MAK Engineering and Services Private Limited, Sambhani Nagar, Khammam.-63047 46627 [M-1167572]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-824667]

■ SHARA సంస్థలో పని చేయుటకు యువకులు కావలెను. Q: 10th, Inter, Degree, ITI, Diploma (P/F). శిక్షణలో 9,500 + ఫ్రీరూం, శిక్షణ తర్వాత 22,000/- + బైక్. సంప్ర: 9063107258. [WA-7260]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-793665]

■ TANMAYEE ఓల్డేజ్ హోమ్, విజయవాడ. మేము నూతనంగా ప్రారంభిస్తున్న హోమ్‌లో పనిచేయుటకు అనుభవం గల ఆడ, మగ వర్కర్లు, వంట మనిషి కా. వ॥20–50. 9652423559, 7093911010, 9573000987 [H-193350]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అథ్లెటిక్స్ టోర్నీకి అనూహ్య స్పందన



బాలికల పరుగు పందెం దృశ్యం



విజేతలకు బహుమతి అందిస్తున్న గూడురు కోటిరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో అథ్లెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమానికి చేయూత ఫౌండేషన్ కార్యదర్శి గూడూరు కోటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని నిరుపేద క్రీడాకారులకు తమ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, పోటీల పరిశీలకులు డాక్టర్ సోలప్ప, శామ్యూల్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మందుల వెంకటేశ్వర్లు, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఒక్క రోజు జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను అండర్–14, 16 బాలబాలికలకు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర ట్రయథిలిన్ గ్రూప్–ఏలో డి.ధనుంజయ్, ఎస్కె అర్షద్, ఎస్‌డీ అష్రాఫ్, ఎస్.తేజ, టి.అనంద్‌తీర్థ, ఎం.సాయిభరత్, గ్రూప్–సీలో డి.ఉమామహేశ్, వి.చరణ్‌గౌడ్, ఎల్.మహాదీప్ బాలికల గ్రూప్–బీలో డి.సుమతి, ఎ.మౌనిక, సీహెచ్ జయశ్రీ, గ్రూప్–సీలో రిశ్వశ్రీ, అశ్విత, మేఘన, అండర్–16 బాలుర 60 మీటర్ల పరుగులో కె.మస్తాన్, బి.చరణ్, తేజ్‌వాల్, లాంగ్‌జంప్‌లో బి.చరణ్, వి.అజయ్, ఎస్.తేజ, షాట్‌పుట్‌లో ఎస్కె ముబీన్, రోహిత్‌కుమార్, తేజ్‌వాల్, జావెలిన్‌త్రోలో ఎస్కే ముబీన్, ఎస్.ఉపేందర్, హేమంత్, హైజంప్‌లో జి.విశ్వంత్, ఎం.అభిషేక్, ఎన్.హేంత్, 600 మీటర్ల పరుగులో కె.మస్తాన్, చరణ్‌కుమార్, జి.వెంకటసాయి, బాలికల 60 మీటర్ల పరుగులో బి.వైశాలి, ఎ.మణుశ్రీ, ఎస్కే సానా, 600 మీటర్ల పరుగులో బి.సాగరిక, ఎస్.సింధు, పి.కార్తీక, షాట్‌పుట్‌లో బి.బింధు, టి.అక్షిత, బి.కృష్ణవేణి, లాంగ్ జంప్‌లో ఎ.మణుశ్రీ, పి.సింధు, ఎం.యువర్షిని, జావెలిన్‌త్రోలో బి.కృష్ణవేని, బి.బింధు, జె.సౌమ్య, 80 మీటర్ల పరుగులో వైశాలి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన తిరపయ్య తన పొలంలో ఆదివారం పురుగులమందు తాగాడు. స్థానికులు గమనించి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా తిరుపయ్య ఖమ్మంలో ఉంటున్నాడు. ఖమ్మం నుంచి తన పొలం వద్దకు వచ్చిన ఆయన పురుగులమందు తాగగా స్థానికులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యకికి గాయాలయ్యాయి. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై ఇల్లెందు వైపు వెళ్తుండగా ఖమ్మం వైపు వస్తున్న లారీ ఢీకొట్టిందని, గాయాలైన వ్యక్తిని ఖమ్మం ఆస్పత్రికి తరలించామని స్థానికులు తెలిపారు. కాగా, సదరు వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని..

ఖమ్మంఅర్బన్: నగరంలోని బోనకల్ రోడ్డులో స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం ఖమ్మం నుంచి ఇమ్మడి వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామమైన బోనకల్ మండలం చొప్పకట్ల పాలెంనకు వెళ్తున్నాడు. ధంసలాపురం వద్దకు చేరుకోగానే స్కూల్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆదివారం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో డీసీసీబీ డైరెక్టర్ మృతి



వేముల శ్రీనివాస్ (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) డైరెక్టర్ వేముల శ్రీనివాస్ (55) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ముదిగొండ మండలం చిరుమర్రి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌కు ఎస్సీ కోటాలో ఖమ్మం డీసీసీబీ పాలకవర్గంలో కోఆప్షన్ డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. కొంతకాలంగా శ్రీనివాస్ ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్ రాంహిల్స్‌రోడ్ నంబర్–9లో ఉంటున్నారు. ఆదివారం ఛాతిలో నొప్పి రావటంతో హుటాహుటిన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. ఆయనకు భార్య వెంకటరమణ, కుమారులు వెంకట్రావు, కిషన్, కూతురు శ్యామల ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన చిరుమర్రికి తరలించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం, ముదిగొండ పీఏసీఎస్ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, డీసీసీబీ అధికారులు, ఉద్యోగులు తదితరులు చిరుమర్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జామాయిల్ చెట్ల నరికివేతపై కేసు నమోదు

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం గ్రామ సర్పంచ్, ఆమె భర్త రామారావు 1.20 ఎకరాల భూమిలో నాటిన జామాయిల్ చెట్లను నరికిన విషయమై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సర్పంచ్ భర్త అయిన చావిడి రామారావు.. సయ్యద్ సాధిక్‌అలీ భూమిలోకి అక్రమంగా చొరబడి జామాయిల్ చెట్లను జేసీబీతో తొలగించారు. ఇదే విషయమై అలీ బంధువు ఆపడానికి ప్రయత్నించగా సదరు రామారావు చంపుతామని బెదిరించాడు. అంతటితో ఆగని రామారావు భూమిలో నిర్మించిన చెక్‌డ్యాంను ధ్వంసం చేశాడు. రూ.3 లక్షల విలువైన జామాయిల్ చెట్లను దొంగతనంగా కొట్టించుకొని తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రామారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి పంచాయతీ దారుగాబంజర్‌లో విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం పక్రారం.. దారుగాబంజర గ్రామానికి చెందిన రాచకొండ సత్యనారాయణ (63) గ్రామ సమీపాన గల తన మిరప తోటకు నీరు అందించేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయగా అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కూతురు రజని, కుమారుడు భరత్ ఉన్నారు. విద్యుత్ వైర్లను ఎలుకలు కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



తిరుమల: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పుష్కరిణిలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ స్నపన తిరుమంజనం, శ్రీ సుద ర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని చేపట్టారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణా కరరెడ్డి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొ న్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో 'కూచిపూడి డ్యాన్స్ లెసన్'

గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారుల ప్రదర్శన

గచ్చిబౌలి (హైదరాబాద్): తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యంచేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలా ఏడు నిమిషాలపాటు కళాకారులు నృత్యంచేస్తూ అలరించారు. గురువు పసుమర్తి శేషుబాబు ఆధ్వర్యంలో కళాకారులు ఏకకాలంలో నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రిషినాథ్ నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. 2020లో త్యాగరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలో ఏకకాలంలో 1,183 మంది కళాకారులు కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారని రిషినాథ్ తెలిపారు. కళలను ప్రోత్సహించి ప్రేరణ కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలోనే కళలను ప్రోత్సహించే సంఘాలుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ కూచిపూడి నృత్యం తెలుగువారికి ఎంతో ఇష్టమైందని, ఈ నృత్యరూపకం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లలిత, వ్యవస్థాపక అధ్యక్షుడు రమణారావు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న కళాకారులు... గిన్నిస్ రికార్డుతో మంత్రులు జూపల్లి, సీతక్క తదితరులు

పెత్తందారు పైశాచికం!

- జనం మెచ్చిన జగన్ పాలనపై అసూయతో రగిలిపోతున్న రామోజీ
- పరిపాలనకు మానవీయ కోణం.. జనంతో నిరంతరం జగన్ మమేకం
- నేను విన్నాను.. ఉన్నానంటూ ప్రతిపక్షనేతగా నాడు ప్రజలకు భరోసా
- మాటకు కట్టుబడి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు పరిపాలన
- సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో సీఎం జగన్
- బాధితులు చెయ్యెత్తితే చాలు.. పిలిచి సమస్య పరిష్కరిస్తున్న సీఎం జగన్
- అనారోగ్య బాధితులకు వెంటనే ఆర్థిక సాయం.. ఆపై ఉన్నత వైద్యం
- అర్హతే ప్రామాణికంగా వివక్ష లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్

క్రిస్మస్ ప్రార్థనల్లో ఏపీ సీఎం జగన్

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు

సాక్షి కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇడుపులపాయలో ఉదయం 9.10 గంటల ప్రాంతంలో తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్దకు చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ బరువెక్కిన హృదయంతో ఘాట్ ప్రాంగణంలో అందరినీ పలుకరిస్తూ ముందుకు కదిలారు. ఇడుపులపాయలోని చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్ కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు.



ఇడుపులపాయ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విజయవాడకు సమీపంలోని పెనమలూరుకు చెందిన ఆటోడ్రైవర్ వెంకట్ (38)కు ఇటీవల ఆకస్మికంగా కాలు, చేయి చచ్చుబడిపోయాయి. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన నగరపాలక సంస్థ డ్రెయినేజీ విభాగ ఉద్యోగి రాజేష్ (42) విధుల్లో ఉండగా.. చేయి చచ్చుబడింది. క్షణాల్లోనే గుర్తించిన స్థానికులు వెంకట్, రాజేష్‌లను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తక్షణమే సీటీ స్కాన్ చేసిన వైద్యులు వారు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినట్టు గుర్తించారు. వెంటనే త్రోంబొలైసిస్ ఇంజెక్షన్స్ ఇచ్చారు. వైకల్యం రాకుండా ఇద్దరినీ కాపాడగలిగారు. సాధారణంగా 55–60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) సంభవించేది. ఇటీవల కాలంలో 45 ఏళ్లలోపు వారిలో ఈ కేసులు అధికమవుతున్నాయి.

యంగ్ స్ట్రోక్

- 30–45 ఏళ్లలోపు వారిలో పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- మహిళల్లో హార్మోన్ల ఇబ్బందులతో స్ట్రోక్
- వంశపారంపర్యం, జీవనశైలే కారణమంటున్న వైద్యులు
- స్మోకింగ్, డ్రగ్స్ కూడా స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయని వెల్లడి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఇటీవల కాలంలో స్ట్రోకింగ్ యంగ్ (45 ఏళ్లలోపు వారిలో బ్రెయిన్ స్ట్రోక్) కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలకు వస్తున్న వారిలో స్ట్రోకింగ్ యంగ్ కేసులు ఎక్కువగా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కదలిక లేని జీవన విధానం.. తీవ్రమైన వత్తిళ్లు.. రక్తం, రక్తనాళాల్లో లోపాలు.. ధూమపానం.. హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల వినియోగం.. వంశపారంపర్య కారణాలు 30 ఏళ్లకే బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి.

25% 'స్ట్రోకింగ్ యంగ్' కేసులే

ఒకప్పుడు వయస్సు 55, 60 ఏళ్ల వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారు. కానీ.. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారిలో 25 నుంచి 30 శాతం మంది 30–45 ఏళ్లలోపు యువతే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్నారు. స్ట్రోక్ తీవ్రతను బట్టి జనరల్ మెడిసిన్, ఏఎంసీ, న్యూరాలజీ విభాగాల్లో చికిత్స అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్న వారిలో రక్తంలో గడ్డలు ఏర్పడి మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వలన వచ్చే స్ట్రోక్ (ఇస్కిమిక్) 80 శాతం మంది, రక్తనాళాలు చిట్లిపోయి (హెమరైజ్డ్) 20 శాతం మంది ఉంటున్నారు.

గోల్డెన్ అవర్‌లో గుర్తించడం ముఖ్యం

ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షణాలను గుర్తించి.. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే స్ట్రోక్ కారణంగా వైకల్యం బారినపడకుంటా వైద్యులు కాపాడగలుగుతున్నారు. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చిన వారికి త్రోంబొలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తంలోని పూడికలు కరిగేలా చేస్తున్నారు. ముఖం, చేయి, కాలు ముఖ్యంగా శరీరం ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి, బలహీనత ఏర్పడటం, ఆకస్మికంగా గందరగోళం ఏర్పడటం, మాట్లాడటం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, కంటి చూపు మందగించడం, తల తిరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మికంగా తీవ్రమైన తలనొప్పి వంటివి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు.



యువకుల్లోనూ కేసులు



ఇటీవల 45 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతోంది. స్ట్రోక్ కేసుల్లో 25% యువతే ఉండటం గమనార్హం. బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు 4 గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే వైకల్యం లేకుండా కాపాడవచ్చు.

–డాక్టర్ దారా వెంకట రమణ, న్యూరాలజిస్ట్, జీజీహెచ్

స్ట్రోక్‌కు కారణాలివీ

పెద్ద వయసుల వారిలో రక్తపోటు, మధుమేహం స్ట్రోక్‌కు కారణమవుతోంది. అయితే.. 45 ఏళ్లలోపు వారిలో హోమోసిస్టీన్, సికిల్ సెల్ అనీమియా, రక్తంలో జన్యుపరమైన లోపాలు, హెరాయిన్ వంటి డ్రగ్స్ వినియోగం, మితిమీరిన మద్యపానం, ధూమపానం, ప్రమాదాల్లో తలకు గాయాలైన వారిలో ఎక్కువగా స్ట్రోక్ వస్తున్నట్టు వైద్యులు చెపుతున్నారు. వీరితో పాటు కదలిక లేని జీవన విధానం కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి స్ట్రోక్‌కు గురవుతున్న కేసులూ ఉంటున్నాయి. మహిళల్లో హార్మోన్స్ ఇబ్బందులు, రక్తనాళాల్లో లోపాల కారణంగా స్ట్రోక్ రావచ్చంటున్నారు. గుండె లోపాలు ఉన్న వారిలోనూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్న దానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఈఈ రవీందర్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. గజానంద రావు, గంగాదేవి దంపతులు రూ. లక్ష వితరణగా అందించగా ఆలయ అధికారులు వారికి రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్, ఇన్‌స్పెక్టర్ సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లికి చేరిన అయోధ్య అక్షింతలు

సత్తుపల్లిటౌన్: అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిరంలో మూడువేల మంది యోగులు, మహర్షులు, సాధువులతో పూజలు నిర్వహించిన అక్షింతలు ఆదివారం సత్తుపల్లి కోదండ రామాలయానికి చేరాయి. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ అక్షింతలను చేర్చేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. రామయ్య అక్షింతలు ఇంట్లో ఉంటే శుభప్రదమని అన్నారు. అనంతరం సత్తుపల్లి నుంచి కరసేవకు వెళ్తున్న భక్తులను సత్కరించారు. కార్యక్రమంలో పోట్రు నాగేశ్వరరావు, నాయుడు రాఘవరావు, కోరుకొండ వెంకటేశ్వరరావు, దేవరపల్లి శ్రీను, చీకటి శ్రీనివాసరావు, చింతల సుబ్బారావు, కొడెమల అప్పారావు, బేతిని అప్పారావు, చల్ల గుళ్ల లోకేశ్వరరావు,వెంకటేశ్వరరావు, హరిబాబు, పాలకొల్లు శ్రీను, నాగస్వామి పాల్గొన్నారు.

శిథిలావస్థలో కరకట్ట రెయిలింగ్

- భద్రాద్రి కరకట్టపై విరిగిన రాడ్లు
- ఏళ్లుగా నిర్వహణలో లోపంతో ఇక్కట్లు
- మరమ్మతులపై పట్టింపులేని అధికారులు
- వైకుంఠ ఏకాదశికి వచ్చిన భక్తులకు తప్పని ఇబ్బందులు



ఐటీసీ ఆధ్వర్యాన బిగించిన రెయిలింగ్ విరగడంతో ఏర్పాటుచేసిన బారికేడ్లు



కరకట్టపై తుప్పపట్టి విరిగిపోయిన రెయిలింగ్ (ఇన్‌సెట్) రెయిలింగ్ విరగడంతో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని గోదావరి కరకట్టకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ రాడ్లు శిథిలావస్థకు చేరాయి. పలుచోట్ల అవి విరిగిపోవడంతో కరకట్టపై ఆహ్లాదం కోసం వచ్చేవారే కాక రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెయిలింగ్‌లు 2000 సంవత్సరంలో కరకట్ట కట్టినప్పుడు ఏర్పాటు చేసినవే కావడం.. దాదాపు 23 ఏళ్లు పూర్తికావడంతో పలుచోట్ల విరిగిపోవడమే కాక మిగతావి కూడా నేడో, రేపో అన్న పరిస్థితి కనిపిస్తోంది.

ఐటీసీ ఏర్పాటు చేసినా...

కరకట్టపై ఐటీసీ పీఎస్పీడీ చొరవతో 2016–2017లో సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు రూ.26 లక్షలతో కొన్నిచోట్ల రెయిలింగ్ నిర్మించారు. నాణ్యత విషయంలో ఇవి మెరుగ్గానే ఉన్నా, ఏర్పాటుచేసి దాదాపు ఎనిమిదేళ్లుగా దాటుతుండడంతో కొన్ని చోట్ల కింద భాగం తుప్పు పట్టాయి. దీంతో వీటిని కూడా మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్వహణకు బడ్జెట్ ఏదీ?

భద్రాచలం పట్టణంలోని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి తెలంగాణ వాసులే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా వేలాదిగా భక్తులు వస్తారు. శ్రీరామనవమి, ముక్కోటి వేడుకల సమయాన రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇలా ఏ పర్వదినం వచ్చినా, వేడుక జరిగినా స్వామి దర్శనానికి వచ్చే భక్తులు గోదావరి కరకట్టపై కాసేపైనా గడుపుతారు. కానీ కట్టపై రెయిలింగ్ చాలాచోట్ల శిథిలమై.. మిగతా చోట్ల కూలేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యాన ప్రమాదాలు జరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, రెయిలింగ్ మరమ్మతులు, నిర్వహణకు ఎలాంటి ప్రత్యేక బడ్జెట్ లేకపోవడంతో స్థానికులు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వదిలేస్తున్నట్లు సమాచారం.

నవమికైనా పరిష్కారం జరిగేనా?

ఇటీవల జరిగిన తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు భద్రాచలానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కరకట్టపై నడిచేటప్పుడు బిక్కుబిక్కుమంటూ ఇబ్బందులు పడ్డారు. అలాగే, వచ్చే ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమికి భక్తులకు తాకిడి ఇంకా ఎక్కువగానే ఉంటుంది. అయితే, రెయిలింగ్ సరిగ్గా లేకపోవడంతో ఆ సమయాన కరకట్టపైకి వచ్చే భక్తుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈమేరకు అధికారులు స్పందించి మరమ్మతులపై తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



కరకట్టపై రెయిలింగ్ మరమ్మతుల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. అలాగే, ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో చర్చించి సీఎస్ఆర్ ఫేండ్ ద్వారా రెయిలింగ్ అభివృద్ధికి కృషిచేస్తాం.

– రాంప్రసాద్, ఇరిగేషన్ ఈఈ, భద్రాచలం

నూతన రెయిలింగ్ ఏర్పాటుచేయాలి



కరకట్ట మీద ఉన్న ఇనుప రైయిలింగ్ శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపి, అటు భక్తులు, ఇటు స్థానిక ప్రజలకు కులుగుతున్న అసౌకర్యాన్ని అధికారులు గ్రహించి, కరకట్టపై నూతన రెయిలింగ్ ఏర్పాటుచేయాలి.

– ఆకోజు సునీల్, భద్రాచలం

నేటితో ముగియనున్న 'గుర్తింపు' ప్రచారం

- ఐఎన్‌టీయూసీ తరఫున రానున్న మంత్రి పొంగులేటి
- ఏఐటీయూసీకి మద్దతుగా కూనంనేని ప్రచారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఈనెల 27న జరుగనుండగా సోమవారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేయగా, సింగరేణి ఎన్నికల్లో మాత్రం ఎవరికి వారే బరిలోకి దిగుతున్నారు. ఐఎన్‌టీయూసీ విజయం కోసం కాంగ్రెస్ నేతలు, ఏఐటీయూసీకి మద్దతుగా సీపీఐ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాగా, కొత్తగూడెం రీజియన్‌లోని ఇల్లెందు, కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ తరఫున ప్రచారానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం వస్తుండగా, ఏఐటీయూసీ తరఫున కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రచారం చేయనున్నారు. టీబీజీకేఎస్, సీఐటీయూ, బీఎంఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుండగా మూడు విప్లవ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు మాత్రం జీఎల్‌బీకేఎస్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 39,786 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కార్మికుల మొగ్గు ఎటో..?

సింగరేణిలో ఈసారి జరుగబోయే గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు ఎటువైపు మొగ్గు చూపుతారోననే చర్చ విస్తృతంగా జరుగుతోంది. టీబీజీకేఎస్‌కు చెందిన ప్రముఖ నాయకులు ఆ యూనియన్‌కు గుడ్‌బై చెప్పగా.. పలువురు కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. దీంతో గెలుపోటములు ఎలా ఉన్నా.. ఐఎన్‌టీయూసీ కేడర్ అనూహ్యంగా పెరిగింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఒక్క సీటుతోనే సరిపెట్టుకుంది. అదే తీర్పు గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ వస్తుందేమోనని టీబీజీకేఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందనే ప్రచారం రావడంతో ఆ యూనియన్‌కు చెందిన అధినాయకులు రాజీనామా చేశారు. అయితే పెద్ద నాయకులే రాజీనామా చేయడంతో ద్వితీయ శ్రేణి కేడర్ కూడా టీబీజీకేఎస్‌కు రాజీనామా చేయగా, వారిలో కొందరు ఐఎన్‌టీయూసీలో చేరారు. దీంతో ఈ సారి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నేడు మంత్రి పొంగులేటి ప్రచారం..

ఖమ్మంమయూరిసెంటర్: సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున ప్రచారం చేసేందుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఉదయం 7 గంటలకు ఇల్లెందు, 9.30 గంటలకు కొత్తగూడెం, మధ్యాహ్నం 2గంటలకు మణుగూరు, సాయంత్రం 6.30 గంటలకు సత్తుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

అశ్వాపురం: మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీలో హోమీ బాబా క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పాఠశాలల బాలికల అండర్–17 క్రికెట్ పోటీలు ఆదివారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. భారజల కర్మాగారం డీజీఎం ఘంటసాల శ్రీనివాస్, డిప్యూటీ ఎంఎం(సివిల్) శెట్టి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, మ్యాచ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్టెల్లా ప్రేమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సభ్యులు బి.వీరన్న, పి.అనిల్‌కుమార్, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు..

రెండో రోజు రెండు మైదానాల్లో ఆరు మ్యాచ్‌లు జరిగాయి. ఖమ్మం – నిజామాబాద్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 127 పరుగులు చేసింది. అనన్య 24, వైష్ణవి 23 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ కావడంతో 46 పరుగులతో ఖమ్మం గెలుపొందింది. అలాగే, హైదరాబాద్ – కరీంనగర్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేశారు. కరీంనగర్ 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 56 పరుగులు చేసి గెలుపొందారు. రంగారెడ్డి – మెదక్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు 12 ఓవర్లలో 46 పరుగులు చేయగా రంగారెడ్డి జట్టు 6.1 ఓవర్లలో 47 పరుగులు చేసి గెలుపొందారు. మహబూబ్‌నగర్ – నల్లగొండ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 12 ఓవర్లలో 75 పరుగులు చేయగా నల్లగొండ జట్టు 54 పరుగులకు ఆలౌట్ కావడంతో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. రంగారెడ్డి – ఆదిలాబాద్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేయగా రంగారెడ్డి జట్టు 3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీఎం శ్రీనివాస్

28 నుంచి రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడలు

సుభాష్‌నగర్ గురుకులం వేదికగా పోటీలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో ఈ నెల 28వ తేదీ నుంచి గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలను నాలుగు జోన్లుగా విభజించారని చెప్పారు. మొదటి జోన్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రెండో జోన్‌లో కరీంనగర్, వరంగల్, మూడో జోన్‌లో ఖమ్మం, నల్లగొండ, నాలుగో జోన్‌లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలున్నాయన్నారు. ఆయా జోన్‌ల పరిధిలో జోనల్ లెవెల్ క్రీడలు పూర్తయ్యాయని, రాష్ట్రస్థాయి పోటీలను సుభాష్‌నగర్ గురుకులంలో నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ శాఖ అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించాలని నిర్ణయించామని, మొత్తం 26 ఈవెంట్లలో ఒక్కో జోన్ నుంచి 300 మంది క్రీడాకారులు చొప్పున 1200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, టెన్నీకాయిట్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, బాక్సింగ్, బాల్‌బ్యాడ్మింటన్ వంటి క్రీడలతోపాటు అథ్లెటిక్స్ కూడా ఉంటాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అరుణకుమారి